## క్లుప్తంగా

### గ్రామాల్లో ఆధార్ డ్రైవ్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సచివాలయంలో ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఆధార్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఈ శిబిరాల్లో ఆధార్ కార్డుల్లో చిరునామాలో మార్పులు, ఫోన్ నంబర్ లింక్, ఇతర అప్‌డేట్స్ చేసుకోవచ్చన్నారు. స్థానికులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### సేంద్రియ ఎరువులతో నాణ్యమైన దిగుబడులు



పాతకోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సుధాకర్

హుకుంపేట: గిరిజన రైతులు సేంద్రియ ఎరువులతో పంట పండిస్తే నాణ్యమైన దిగుబడులు మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ అన్నారు. మండలంలోని పాతకోట పంచాయతీలోని పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామల్లో సేంద్రియ ఎరువులతో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపించాలన్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

### దీన్‌దయాల్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గంగవరం: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షురాలు నీలాలమ్మ అధ్యక్షతన సేవాప క్వాడ్ కార్యదర్శి కుంజం సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, బిజెపి నాయకుడు కోసూరి కాశీ విశ్వనాథరెడ్డి పాల్గొని మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ మాస్టారు దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు.విద్యారంగ వ్యాప్తి, సనాతన ధర్మం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. నాయకులు నీలాలమ్మ, సూర్యచంద్ర, వెంకటేశ్వర్లు, పావని, ముత్యాలరావు, పాపారావు, పోతురాజు పాల్గొన్నారు.

### పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ కడబాల ఆనందరావు

వై.రామవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీని అభివృద్ధి చేసే విధానంపై ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

### సర్పంచ్ రామారావుకు పరామర్శ



జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న లోదొడ్డి సర్పంచ్ రామారావు

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి సర్పంచ్, రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు లోతా రామారావు గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబీకులు సన్నిహితులు జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. డీహైడ్రేషన్, కడుపునొప్పితో బాధపడుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామారావును జడ్డంగి. గడుఓకుర్తి సర్పంచ్‌లు మురళీకృష్ణ, చంద్రుడు పలువురు వైఎస్సార్‌సీపీ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, ఉపాధ్యాయులు కలిసి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో రెండు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, ఆపైన చదివి, 18 నుంచి 44 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9490219717 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# పంటకు తెగుళ్లు.. అన్నదాత దిగులు

- వరిపైరుకు చీడపీడల బెడద
- ఆందోళనలో రైతులు
- సలహాలు పాటించాలంటున్న అధికారులు



రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారులు



దారకొండలో చిరుపొట్ట దశకు చేరుకున్న వరి పైరు

సీలేరు: వాతావరణంలో మార్పులతో పంటలకు తెగుళ్ల బెడద తప్పడు.. వివిధ రకాల చీడపీడలు పంటలను నాశనం చేయడంతో దిగుబడి దారుణంగా పడిపోతోంది.. దీంతో దిగుబడి దారుణంగా తగ్గుతోంది. రైతులు అప్రమత్తంగా ఉండి తెగుళ్ల నివారణకు సరైన సూచనలు, సలహాలు పాటించకుంటే అన్నదాతకు తీరని నష్టం చవిచూడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ కారణంగా రైతులు ముందస్తుగా తగిన జాగ్రత్తలు పాటించి, తెగుళ్ల నివారణపై దృష్టి సారిస్తే పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడి నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు ఈ కాలంలో చేపట్టే వివిధ పంటల్లో అవగాహనతో వ్యవసాయం లేకపోతే ఆర్థికంగా నష్టపోతారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.ముఖ్యంగా వరి. మొక్కజొన్న, వేరుశెనగ, రాగులు పంటలపై వాతావరణానికి అనుకూలంగా ఎటువంటి తెగుళ్లు రాకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.ఉష్ణోగ్రత పెరగడం , తగ్గడం వంటి వాతావరణ పరిస్థితుల్లో వరి పైరుకు అధికంగా తెగుళ్లు సోకుతాయి. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి గిరిబాబు చెబుతున్నారు. వరి నాట్లు వేసే 60 రోజులు పూర్తయ్యాయి. చిరు పొట్ట దశకు చేరుకున్నాయి. వరి పైరుకు ఇది తెగుళ్ల కాలమని, వ్యవసాయ సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు ఆశించవచ్చు చెబుతున్నారు. ప్రస్తుతం వరి పైరుకు అగ్గి తెగుళ్ల, పొడి తెగులు, ఎండు తెగులు సోకుతాయి. దీనిపై రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.వాతావరణం వేడెక్కడం, వరి కావాల్సినంత నీరు లేకపోవడం వల్ల ఈ తెగుళ్ల వ్యాప్తి చెందుతాయి. పంటకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి గిరిబాబు పలు సూచనలిస్తున్నారు.

**నియోజకవర్గంలో పంటల వివరాలు..**

గూడెం కొత్త వీధి మండలంలోని16 పంచాయతీల్లో 15,485 రైతులు ఈ ఏడాది ఎనిమిది వేల ఎకరాల్లో వరి గిరిజనులు సాగు చేస్తున్నారు.మొక్కజొన్న 1,300.వేరుశనగ 930. రాగులు.1,575 ఎకరాలు సాగులో ఉన్నాయి.

చింతపల్లి మండలంలోని 17 పంచాయతీలో పదివేల మంది రెత్తులు 8,400 ఎకరాలు వరి.1300 ఎకరాల్లో మొక్కజొన్న, 930 ఎకరాల్లో వేరుశనగ, 1,575 ఎకరాల్లో రాగులు పండిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి మధుసూదన్ తెలిపారు.

జి. మాడుగుల మండలంలోని 17 పంచాయతీల్లో 14,000 మంది రైతులు ఉండగా, 8988 ఎకరాల్లో వరి, 1705 ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ-622 ఎకరాలు, రాగులు- 2,588 ఎకరాల్లో పండిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.వరప్రసాద్ చెప్పారు.

పాడేరు మండలంలోని 26 పంచాయతీలో 11,500 మంది గిరిజన రైతులున్నారు. ఇందులో 9,600 ఎకరాల్లో వరి, మొక్కజొన్న-5,898 ఎకరాలు, వేరుశనగ-486 ఎకరాలు, రాగులు 2,975 ఎకరాల్లో పండిస్తున్నట్టు ఏవో శ్రీనివాస్ తెలిపారు.

**● అగ్గి తెగులు**

వరి పైరు ఆకుమీద చిన్న డైమండ్ ఆకారంతో మచ్చలు ఏర్పడతాయి. అది నల్లగా మారి మొక్క మాడిపోతుంది. ఈ తెగులు ఆకులో పత్ర హరితాన్ని తినడంతో పంటకు నష్టం జరుగుతుంది. దీని నివారణ సైక్లోజిన్సాన్‌ను ఎకరాకు 120 గ్రాముల పొడరును నీటిలో కలిపి 150 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.పెస్టో సైక్లిన్ 18 గ్రాములు నీటిలో కలిపి ఎకరాకు 150 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.

**● పొడ తెగులు..**

వరి పైరుకు మొదటి భాగం నుంచి ఈ తెగులు సోకుతుంది. మొదటి భాగంలో పొడ పాము మీద ఉన్న మచ్చలు మాదిరిగా వరి ఆకలకు సోకి కింద నుంచి పైకి సోకుతుంది.వరి పంట అంతా మచ్చలతో మారి ఎండిపోతుంది. పంట మొత్తం నాశనమవుతుంది.

ఈ తెగులు నివారణకు పొలం గట్లు మీద ఉన్న గడ్డిని పూర్తిగా తొలగించడం, నివారణకు కాంటాఫ్ ద్రావణాన్ని ఎకారాకు 400 మిల్లీలీటర్లు 150 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అవతార్ అర కేజీ పొడర్‌ను తగినంత నీటిలో పిచికారీ చేయాలి.

**● ఎండు తెగులు**

వరి పైరు ఆకులకు ముందుగా ప్రారంభమై ఈ తెగులు చివరి వరకు సోకుతోంది. ఆకుపచ్చని రంగును క్రమేపీ హరించి వరి ఆకులను బూడిద రంగులోకి మార్చేస్తోంది. దీంతో పంట పూర్తిగా నాశనమవుతుంది.

దీనివల్ల ఆకులతో పాటు వరి పిలకలన్నీ ఎండిపోయి దుబ్బు చచ్చిపోతుంది. ఈ తెగులు నివారణకు ఫ్లాంటా మాసిన్ 100 గ్రాములు, 200 గ్రాములు ఎండోఫిల్ జెడ్-78 పిచికారీ చేసుకోవాలి.

**సలహాలు పాటించాలి**



మండలంలో వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. పంటకు తెగుళ్ల లక్షణాలు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. మండలంలో వ్యవసాయ అధికారితో పాటు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న సిబ్బందిని కలిసి సమస్యను తెలియజేసి, సూచనలు, సలహాలు పాటించాలి. పండించే ప్రతి పంటపై అవగాహన తీసుకొని లాభాలు వచ్చే విధంగా గిరిజనులు ఉండాలని కోరుతున్నాం.

– ఎ.గిరిబాబు, ఏవో, గూడెం కొత్తవీధి

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుధ్య సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీపీ రమేష్, ఎంపీడీవో బాలమురళీకృష్ణ, సర్పంచ్‌లు

కొయ్యూరు: పంచాయతీలు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీపీ బడుగు రమేష్‌బాబు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కార్యదర్శులు, పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీతో పంచాయతీల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. వనరులను ఉపయోగించుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ఎంపీపీ సూచించారు. అదే విధంగా కొన్ని పనులను నిర్వహిస్తే రాష్ట్రం నుంచి నిధులు వస్తాయన్నారు. పంచాయతీల్లో అన్ని రకాల వసతులు ఉండాలని చెప్పారు. నిధుల కొరత కారణంగా పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎంపీడీవో బాలమురళీ కృష్ణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, డౌనూరు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.అప్పారావు, ఎంఈవో -2, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శానిటేషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్న రాజేంద్రపాలెం పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని అంతా కలిసి సన్మానించారు.

## ఆరోగ్యభద్రతపై అవగాహన



చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

చింతపల్లి; మహిళలు ఆరోగ్యం పట్ల పూర్తి జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు రుక్మిణి, వాసవిలు అన్నారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకుని మహిళలకు ఎదుర్కొంటున్నటువంటి అన్ని వైద్య సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. వైద్యాధికారులు సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారుల ప్రభావతి, లావణ్య, శ్రీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ల్యాబ్ టెక్నిషిన్లు అనిల్,సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న యూటీఎఫ్ నేతలు



గుంటూరు రణభేరిలో గంగవరం మండల నాయకులు

అడ్డతీగల: విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ అడ్డతీగల మండల ప్రధాన కార్యదర్శి రాఘవులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విధి విధానాల్లో మార్పులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కారం తదితర అంశాలపై గుంటూరులో గురువారం జరిగిన రణభేరి సభ, ధర్నా కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపామన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించడం, భోధనకు మాత్రమే పరిమితం చేయాలని, భోధనేతర పనుల నుంచి పూర్తిగా మినహాంచాలని డిమాండ్ చేశామన్నారు. ఉపాధ్యాయులకు పీఆర్‌పీ అమలుచేయాలని, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, నాలుగు డీఆర్‌లను వెంటనే మంజూరు చేయాలన్నారు. జెడ్పీపీఎఫ్ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. మంగరాజు, చిన్నారావు, చిన్నిబాబు పాల్గొన్నారు.

గంగవరం : ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ చేపట్టిన రణభేరి బహిరంగ సభకు మండలం నుండి భారీగా యూటిఎఫ్ ప్రతినిధులు తరలివెళ్లారని జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు. మండలం నుంచి 50 మంది ప్రతినిధులు యూటీఎఫ్ రణభేరికి తరలివెళ్లారన్నారు.

## చైన్ స్నాచింగ్‌పై కేసు నమోదు



వివరాలు తెలియజేస్తున్న బాధితురాలు అచ్చమ్మ

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగ ఓ వృద్ధురాలి మెడలో బంగారు పుస్తెల తాడు తెంపుకొని పోయాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే మేడిశెట్టి అచ్చమ్మ తన ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో దొంగ ఆమె మెడలోని బంగారు గొలుసు తెంపుకొని పరారయ్యాడు. ఆమె నిద్ర నుంచి తేరుకొని బిగ్గరగా కేకలు వేయడంతో దొంగ పరారైనట్టు అచ్చమ్మ భర్త తాతారావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివకుమార్ చెప్పారు.

## భక్తిశ్రద్ధలతో తిరువీధి సేవలు



స్వామివారికి తిరువీధి సేవలు చేస్తున్న అర్చకులు

నక్కపల్లి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాకలో గురువారం పుణ్యకోటి వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు, దిగువ ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో నిత్యపూజలు, అర్చనలు పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని పుణ్యకోటి వాహనంలో ఉంచి తీరువీధి సేవలకు తీసుకెళ్లారు. ఖభక్తులు కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని అర్చకులు వరప్రసాద్, కృష్ణమాచార్యులు తెలిపారు.

## ఘనంగా అమ్మవారి ఉత్సవం



ఊరేగింపులో భక్తులు

కశింకోట: కశింకోటలో గురువారం సాయంత్రం సత్తెమ్మతల్లి బోనాల(ఘటాల) ఊరేగింపు ఘనంగా జరిగింది. అత్యధిక మంది మహిళలతో పాటు పురుషులు బోనాలు తలపై పెట్టుకొని స్థానిక కస్పావీధి నుంచి పెద్ద ఊరేగింపుగా బయలుదేరారు. అక్కడి నుంచి పెద్ద బజారు, గవరపేట మీదుగా కనక మహాలక్ష్మి వీధి వరకు ఈ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా చెక్క భజనలు, డప్పులతో బాణసంచా కాలుస్తూ అమ్మవారిని ఊరేగించారు. ప్రజలు దారి పొడవునా బిందెలతో రోడ్డుపై నీరు పోసి అమ్మవారికి భక్తి పారవశ్యంతో ఆహ్వానం పలికారు.

## పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీవో జయప్రకాష్

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ కంబాలుబయలు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ, శానిటేషన్ ఏక్టివిటీలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణను గురువారం పాడేరు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో)జయప్రకాష్ పరిశీలించారు. అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ చేపడుతున్న కార్యక్రమాన్ని అందరు విజయవంతం చేయాలని ఆయన సూచించారు. సింగర్బ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుని ఆయన పరిశీలించారు. షెడ్డు నిర్వహణ పట్ల అశ్రద్ధ వహించకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని ఆయన తెలిపారు. నిర్వహణకు పలు సూచనలు,సలహాలను ఆయన తెలియజేశారు. ఎంపీడీవో డేవిడ్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రవిశాస్త్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మండల సమావేశం

చింతపల్లి: సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోరాబు అనూషదేవి అధ్యక్షతన శుక్రవారం ని ర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు హాజరు కావాలని కోరారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల/వై.రామవరం/రాజవొమ్మంగి: రంపచోడవరం 220/33కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం నియోజకవర్గంలోని రంపచోడవరం, గంగవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ టి.గాబ్రియేల్, వై.రామవరం మండలం ఏఈ కె.అబ్బాయిదొరలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆయా మండలాల్లో ఈ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ పి.వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కొరుప్రోలు నుంచి నర్సీపట్నం మీదుగా చింతపల్లికి విద్యుత్ సరఫరా అవుతున్న 132 కేవి విద్యుత్‌లైన్‌లో జంగిల్ క్లియరెన్సు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ రోజు ఉదయం 8 గంటట నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతుందని, వినియోగదారుల సహకరించాలని ఆయన కోరారు.

## తాగునీటి సమస్యపై వినతి



ఎంపీపీ అనూషదేవికి వినతిపత్రం అందజేస్తున్న పెద్దవీధి గ్రామస్తులు

చింతపల్లి: మండలంలోని కొమ్మంగి పెద్దవీధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి గణబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు గంతన్నదొర, నూకరాజు, వెంకటరావు, గుణరావు,ఈశ్వరరావు తదితరులు ఎంపీపీ కోరాబు అనూషదేవికి గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 25 కుటుంబాలకు చెందిన ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో తమ పెద్దవీధి గ్రామానికి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా అయ్యేదని, ఈ పథకం రిపేర్ కావడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ గ్రామానికి ఎటువంటి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో గత్యంతరం లేక సమీపంలోని ఊటగెడ్డను ఆశ్రయిస్తున్నామని చెప్పారు. వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలోని బురదనీటిని తీసుకొవడానికి నానా అవస్థలు పడుతున్నామని, కలుషిత నీటితో రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి(అరకులోయటౌన్): ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించని ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శెట్టి నీలవేణి డిమాండ్ చేశారు. ఆమె గురువారం విలేకరులతో ఎంపీపీ మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కనెక్ట్ పాడేరు పాడేరు ప్రాజెక్టులో భాగంగా గుర్తించి అభివృద్ధి చేస్తున్న రహదారులకు కొనసాగింపుగా కూటమి ప్రభుత్వంలో అడవి తల్లి బాట పేరిట మంజూరు చేసి, రహదారుల శంకుస్థాపన చేస్తున్న కార్యక్రమానికి ప్రజా ప్రతినిధిగా ఉన్న ఎంపీపీ, ఇతర వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను కనీసం సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని పెదకోట నుంచి జాలడ వరకు రహదారి విస్తరణ పనులు, కొండిభ పంచాయతీ సాడా రహదారి పనులకు గురువారం శంకుస్థాపన చేయించిన అధికారులు ఈ కార్యక్రమానికి కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేయడం ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులైన జెడ్పీటీసీ, ఎంపీపీలకు అగౌరవపర్చడనన్నారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ నీలవేణి చెప్పారు.

## సమాజంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ఫార్మసిస్ట్ జోగారావును సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

కూనవరం: వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని, వారి సేవలు మరువలేనివని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా కోతులగుట్ట సీహెచ్‌సీలో గురువారం ఫార్మసిస్ట్ తుష్టి జోగారావును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలోను, విపత్కర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించడం ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. డాక్టర్ తేజ, హెడ్‌నర్స్ బొజ్జి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది దుర్గమ్మ, రాజమణి, దేవిప్రసన్న, రమేష్, రవితేజ, అఖిల్, బాపిరాజ్, దిలీప్, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## వరద బాధితులకు సాయం



వరద బాధితులతో దాతలు

కూనవరం: వరద బాధితులు నిత్యావర వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం మెత్రాసన సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్, ఫాదర్ మాదాల సురేష్ అన్నారు. ఇటీవల నాలుగుసార్లు వరద ముంపునకు గురైన మండల కేంద్రంలోని ఉదయ భాస్కర్ కాలని, సినిమాహాల్, బస్‌స్టాండ్ సెంటర్‌లు, గిన్నెలబజార్‌కు చెందిన సుమారు 250 వరద బాధిత కుటుంబాలకు గురువారం బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, బిస్కెట్స్, బెడ్‌షీట్లు తదితర నిత్యావసర కిట్లను పంపిణి చేశారు. అనంతరం ఫాదర్ సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం మెత్రాసన పీఠకాపరి మహాఘన సగిలి ప్రకాష్ తండ్రి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మదర్ థెరీసా సంస్థ రీజినల్ సుపీరియర్ సిస్టర్ సిస్టినా, నెల్లిపాక ఫాదర్ డీప్రేమ్ కుమార్, మచ్చా వినయ్, కొమ్మాని సునీత, వీర్రాజు, ఎం.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



చింతపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ నాగార్జున

చింతపల్లి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందని ఈగల్ టీం ఇన్స్‌పెక్టర్ డి.నాగార్జున అన్నారు.గురువారం స్థానిక మదర్‌థెరీసా ఒకేషనల్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి మత్తు పదార్థాలకులోను కాకుండా క్రమశిక్షణతో మంచి ఉపాధి అవకాశాలు సాధించాలన్నారు. గ్రామాల్లో కూడా ఈ మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా చైతన్య పరచాల్సిన బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులతో డ్రగ్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేయించారు.